
# ఏడు లాంతర్ల సెంటరు

-వేంపల్లి గంగాధర్

**మరి కాసేపట్లో దొరగారి టాంగా ఆ దావెం బడి పోతుందనగా గుర్రాల మీదొచ్చిన ఐదారు మంది జవాన్లు దారికి ఆ పక్క ఈ పక్క వున్న వాళ్ళను చెదరగొట్టుకుంటూ, అరుగుల మీద కూర్చున్న వారిని లేపుతూ ఎర్ర దుమ్ము రేపు కుంటూ పోయినారు. వాళ్ళట్లా పోయినాంక రొంత సేపటికి ఆ దావెంబడి దొరగారి టాంగా బండి రివ్వునపోయింది. కోటు, బూటు, సూటు, నెత్తికి నల్లటి టోపి, చేతిలో కర్ర, నోట్లో పొగాకు చుట్ట ఇది నెలువెత్తు దొర రూపం.**

"చూశావురా... వీరనాయుడు...

మన ఇంటి కాడ, మన ఊర్లో మనం నిలబడేకి కూడా కాలం కాకుండా పోయింది. వాడు యాన్నుంచో దేశం గాని దేశం నుంచి వచ్చి మన వూర్లో రాజ్యమేలతా వుండాడు. ఎవడు మొగోడంటావ్!"- అనడి గాడు మునిరత్నం నులక మంచం మీద కూర్చుంటా.



"ఊర్కో పెద్దాయన...

దొర మాట మనకెందుకు:.. దొరను పట్టుకొని వాడు, వీడు అనంటే ఈ జవాన్లు నీ రెక్కలిరిచి కట్టుకపోయి ఏడులాంతర్ల సెంటరు కాడ కోలి కొక్కెరాయి వేస్తారు... జాగ్రత్త..."- అరుగు మీద కూర్చుంటా హెచ్చరించినాడు అంకిరెడ్డి.

'ఔనౌను... మొన్న నెమలివాగు వంక కాడ దొర ముందు నిలబడి- 'మీ దేశం మీరు పోండి; మా బతుకులు మేం బతుకుతాం. పన్నులు కట్టమని' నినదించిన భూపాల్ గాడ్ని ఏం జేసినారో గుర్తు లేదు... ఏడు లాంతర్ల సెంటరు కాడ్నే పట్టపగలు ఉరి తీసినారు... ఆ కథ అనుకుంటానే ఏడుపొస్తాది...' అక్కడ్నే మునిరత్నం పక్కన చిన్నగా కూర్చుంటా అన్నాడు మాణిక్య శాస్త్రి.

'...బాగుంది. అందరూ మళ్ళీ ఒకే చోట చేరినారు. ఆ జవాన్లు జూస్తే దొరగారికి వ్యతిరేకంగా వ్యూహాలేవో చేస్తాండరని అనుకుంటారు. పంటల గురించో, భూముల గురించో, దొర కొలువులో ఉద్యోగాల గురించో మంచిగా మాట్లాడుకోండి... అందరికీ బాగుంటాది...' తన మనసు లోని కలవరాన్ని బయటపెట్టింది సుందరోళ్ళ జానకమ్మ.

'దొర కొలువులో ఉద్యోగమంటే ఇంగ వీరనాయుడే జెయ్యాల. మన చేత అయ్యే పనికాదు. ఆ గుర్రాలు మన మాట విని సావవు. పట్టుకోబోతే కిందేసి తొక్కుతాయి. మనకా అంతకు మించి ఉద్యోగాలు యివ్వరు.' నిట్టూర్పు విడిచినాడు అంకిరెడ్డి. అందరూ ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుకుంటూనే వున్నారు. కానీ... వీర నాయుడే మౌనంగా... నిశ్శబ్దంగా... దొరగారి టాంగా పోయిన దారివైపే ఎర్రటి కళ్ళతో చూస్తుండిపోయాడు.

* * *

అడ్డుగోడల్ని బద్దలు కొట్టుకొని మనిషిగా బయట పడడమంటే మాటలు కాదు...! ఒక్కోసారి అంతః కరణాన ఏ మూలనో దాగిన రహస్య హృద యాంతర విషాదం అగ్ని గుండమై ద్వేషాగ్ని జ్వాలల్ని ప్రజ్వరిల్లిస్తుంటే ప్రచండ ప్రళయ ఝంఝా మారుతాల్ని బయటకి తెలియకుండా గుప్పిట బిగించి కప్పుకోవడమూ అందరికీ సాధ్యమయ్యే సాహసం కాదు.

ఇప్పుడు అలాంటి సాహసమే వీరనాయుడు రూపంలో పోరాడబోతోంది. దొరగారి టాంగా పెద్దపట్నం వైపు వెళ్ళింది. మరి కాసేపట్లో ఇదే దారిలో వెనక్కి వస్తుంది. మార్గమధ్యలో గువ్వల చెరువు గుట్టమీద కాపుకాచి వ్యూహం పన్నింతే...

మూడో కంటికి తెలియకూడదు. తెలిస్తే యింకేమైనా వుందా... ఏడు లాంతర్ల సెంటరు కాడ నరబలి... అది కాదంటే భూమన్‌ను తీసినట్లు పట్టపగలే ఉరి తీస్తారు... అది కూడా కాదంటే దొరగారి రైఫిల్ గుండెల్ని రెండుగా పేల్చుతుంది... మరి తను... చస్తే... పొరపాటు సామాన్యంగా జరగదు... ఒకవేళ జరిగి తను జవాన్లకు చిక్కితే... తననే నమ్ముకున్న అమ్మా... నాన్న... పెళ్ళి చేయాల్సిన చెల్లిని ఎవరు చూసుకుంటారు...

ఆలోచనలు ఇలా చుట్టుముట్టి పరిభ్రమిస్తుండగానే ఆరు మంది జవాన్లు దుమ్ము రేపుకుండా మట్టి దారెంబడి సాగిపోయారు... మరి కాసేపట్లో దొరగారి టాంగా వస్తుంది... తనిప్పుడు గుట్టమీద వున్నాడు. దొరగారి టాంగా వచ్చే సమయంలో పైనుంచి ఓ బండరాయిని కిందకు దొర్లిస్తే చాలు...

దొర బండి తునాతునకలవుతుంది. బండరాయి కింద దొర రక్తం కక్కుకొని చావాల్సిందే... దూరంగా టాంగా... వస్తున్న చప్పుడు.. వస్తోంది... వస్తోంది... దగ్గరగా... దగ్గ రగా... ఎర్రమట్టి దుమ్మురేగుతోంది... వీరనాయుడికెం దుకో ధైర్యం చాల్లేదు... దొర టాంగా రివ్వున వెళ్ళిపో యింది. వీరనాయుడు నుదుటికి పట్టిన చమటను తుడు చుకుంటూ కానుక చెట్టు నీడలో కూలబడ్డాడు.

* * *

రెండ్రోజుల తర్వాత దొరగారి బంగ్లాలో ఉద్యోగాల కోసం కొంతమందికి పిలుపొచ్చింది. అందులో వీరనా యుడు ఒకడు. ఇంట్లో అందరూ సంతోషపడ్డారు. 'ఎలాగైనా దొరను మెప్పించి కొలువులో ఉద్యోగాన్ని పొందాలని' అమ్మ ఆశ పడింది.

'బంగ్లాలో ఉద్యోగమంటే అన్నయ్య కూడా దొరనే!'- సంబర పడింది చెల్లెలు.

'నా కొడుక్కి దొరగారి బంగ్లానుంచి ఉద్యోగంకోసం పిలుపొచ్చింది... రామన్న వింటున్నావా... సోమశేఖరం వింటున్నావా...' తండ్రి ఆరాటం ఆయనిది.

వీరనాయుడికి దొర దగ్గర పనిచేయడం ఏమాత్రం ఇష్టం లేదు. కానీ ఇంటిల్లిపాది తనను బంగ్లా కొలువులో వుండాలని కోరుకోవడం... పిలుపొచ్చినందుకే ఊరంతా చెప్తున్న తండ్రి తపన... వెరసి వీరనాయుడ్ని బంగ్లాలోకి నడిపించాయి.

'గుర్రపు స్వారీ వచ్చుండాలి. గుర్రాన్ని బాగా చూసుకో వడం వచ్చిండాలి. సమయానికి దానికి మేత పెట్టాలి. బంగ్లానుంచి ఎప్పుడు కబురొచ్చినా వెంటనే వచ్చి బండి కట్టాలి. తరచూ సెలవలు పెట్టడం కుదరదు. బంగ్లాలోకి అడుగు పెట్టేముందు మెడలో తువ్వాల వేసుకొని వుండాలి. కాళ్ళకు చెప్పులు వుండకూడదు. చేతులు కట్టుకోవాలి. తక్కువగా మాట్లాడాలి. పద్ధతిగా నడుచుకోవాలి. చెప్పిన పని చెప్పినట్లు చేయాలి. ఏదైనా తేడా వచ్చిందో ఏడులాంతర్ల సెంటరు కాడ మీ ఖర్మ తెగుతుంది...' వివరంగా పని వివరాలను తెలిపాడు బంగ్లా మేస్త్రి.

ఇద్దరు ముగ్గురు తాము పని చేయలేమని వణికే స్వరాత్తో చెప్పి నిప్పుల కుంపటి నుంచి బయట పడుతున్నట్లు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. మరో ఇద్దరు తమకు

గుర్రాల విధానం గురించి, వాటి బాగోగుల గురించి తెలియదని చెప్పి చిన్నగా అక్కడినుంచి జారుకున్నారు.

'నీ పరిస్థితి ఏమిటన్నట్లు' వీరనాయుడి వైపు చూస్తూ బంగ్లా మేస్త్రీ కళ్ళు ఎగురేశాడు. 'నేనిప్పుడు మన ఊర్లోని విరూపాక్షస్వామి ఆలయంలో పల్లకి పనికి వెళ్తున్నాను. మరో రెండువారాల్లో ఆ పని పూర్తి అవుతుంది... తర్వాత వచ్చి ఉద్యోగంలో చేరతాను...' మేస్త్రీ కళ్ళలోకి సూటిగా చూస్తూనే జవాబిచ్చాడు వీరనాయుడు.

'దొరకంటే దేవుడేం గొప్పోడుకాదు గానీ... రేపట్నుంచే పనిలోకి వస్తే పద్ధతిగా వుంటాది. నీ మంచి కోరే చెప్తాండ...' భుజం తట్టి చెప్పినాడు మేస్త్రీ.

ఇంటి దగ్గర పరిస్థితి మరోసారి గుర్తుకొచ్చింది. ఏం జవాబియ్యాలో అర్థంకాలేదు. 'సరేనన్నట్లు' తలాడించి ఇంటి దారి పట్టాడు వీరనాయుడు.

★ ★ ★

చుట్టు పక్క నూటపదారు పల్లెల్లోనూ, పన్నెండు తాలూకాల్లోనూ పాలెగాళ్ళ ఆధిపత్య పోరు ఎక్కువైంది. మరోవైపు కాగడా దొంగల దోపిడీ సామాన్య జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. రాత్రిపూట వంతుల వారిగా గ్రామాల్లో ప్రజలు ఊర్లకు కాపలాగా వుంటున్నారు.

ఇళ్ళల్లో దాచుకున్న నగలు, సొమ్ముతోపాటూ గాదెల్లోని ధాన్యాన్ని కూడా మరోవైపు 'ఊళ్లమీద పడి పాలెగాళ్ళు దోచుకుంటు అలజడి సృష్టించారు. పాలెగాడు తిమ్మారెడ్డి దొరల గుండెల్లో గుబులు పుట్టించినాడు. పులిందల కోటలో కూర్చొని హిరణ్య రాజ్య సరిహద్దుల్ని కూడా శాసిస్తా వుండాడు. రాత్రిపూట ఊర్లని దోచుకొని వయసొచ్చిన ఆడ పిల్లోళ్ళతో కోటలో కులుకుతా వుండేటోడు. తిమ్మారెడ్డిగాడ్ని అణిచి పులిందలను తన తాలూకాలోకి తెచ్చుకోవాలని దొర పన్నాగం చేసినాడు.

పాలెగాళ్ళన్ని అణిచితే తప్ప తమ సామ్రాజ్యం విస్తరించదని... అందుకు తగిన బలగాలను... మందుగుండు సామగ్రిని దత్త మండలాలకు పంపాలని దొర కంపెనీ వాళ్ళకు వర్తమానం పంపాడు. లేఖ అయితే పోయింది గానీ కంపెనీ త్వరగా స్పందించలేదు. ఫలితంగా తన దగ్గర ప్రస్తుతం వున్న బలగాన్నే పులిందలకు పంపాలని దొర నిర్ణయం తీసుకున్నాడు. అనుకున్నదే తడవుగా సైన్యం కదిలిపోయింది. ప్రమాదాన్ని ముందుగానే ఊహించిన తిమ్మారెడ్డి కోట పైనుంచి ఈటెలతో, బాణాలతో తన మనుషుల ద్వారా దాడి చేయించినాడు. దాదాపుగా పోరాటం రెండువర్గాల మధ్య వారంరోజులపాటూ సాగింది.

ఇంతలో మద్రాసునుంచి కంపెనీ బలగాలు దిగాయి. పులిందల చేరుకొని తమ సత్తా చూపించాయి. తిమ్మారెడ్డి తల తిరిగింది. లొంగక తప్పని పరిస్థితి ఏర్పడింది. 'తనని ప్రాణాలతో విడిచిపెడితే కవ్వంకోన అడవుల్లోకి పోయి కాలం వెళ్ళదీసుకుంటానని' రాయబారం పంపాడు.

'ముందు బంధీగా లొంగితే క్షమాబిక్ష విషయం తర్వాత ఆలోచిస్తామని'- దొర సందేశమిచ్చాడు. దెబ్బతిన్న పులి లాగా తిమ్మారెడ్డి దొర బలగానికి లొంగిపోయినాడు. పులిందల నుంచి బంగ్లాకు తీసుకొచ్చి గొలుసులేసి దొర ముందు నిల్చోబెట్టినారు.

తిమ్మారెడ్డిని చూసినాడే గానీ...

యింకేం మాట్లాడలేదు దొర.

'యిక్కడ కాదు... వీడ్ని ఏడులాంతర్ల సెంటరు కాడికి తీసుకుపోండి... అక్కడికి నేను కూడా వస్తాను...' అని చెప్పి దొర మళ్ళీ బంగ్లాలోకి వెళ్ళిపోయాడు. కాసేపటికి బండి సిద్ధంచేయమని కబురొచ్చింది. పరుగు పరుగున బయలుదేరి పోయాడు వీరనాయుడు.

దొర తిరిగే బండికి తాను పనికెక్కడం అదే మొదటి సారి. అంతవరకు దొరసానమ్మకు బండి కట్టడం... ఊర్లు తిప్పడమే గానీ దొరవారి టాంగాకు పనికెక్కింది లేదు. ఇప్పుడు కూడా ఎప్పుడూ దొర బండి నడిపే సిద్ధినాగులన్న అనారోగ్యంగా వుండడంతో వీరనాయుడ్ని పిలిపించారు.

దొరగారి టాంగా కదిలింది.

ముందు ఐదారు మంది జవాన్లు ఎర్ర దుమ్ము రేపుకుంటా పోతున్నారు. వీరనాయుడి చేతిలో గుర్రాల పగ్గాలు... బండి రివ్వున ముందుకు సాగిపోతాంది... కాసేపటి తర్వాత టాంగా ఏడు లాంతర్ల సెంటరుకు చేరుకుంది.



పడుకోబెట్టిన తిమ్మారెడ్డి పైనుంచి
అట్నుంచి ఇటు... ఇట్నుంచి అటు
రెండుసార్లు ఏనుగును తిప్పారు...
అంతే తిమ్మారెడ్డి పొట్టలోని పేగులు
బయటకు వచ్చా యి. రక్తం కక్కు
కొని ఆర్తనాదాలు
పెడతా సచ్చి నాడు...

ఒకవైపున ఇనుప గొలుసులతో బంధింపబడి వున్న పాలేగాడు తిమ్మారెడ్డి.

మరోవైపు నల్లకొండలా ఘీంకరిస్తున్న ఏనుగు. దొర బండి దిగాడు.

పడుకోబెట్టిన తిమ్మారెడ్డి పైనుంచి అట్నుంచి ఇటు... ఇట్నుంచి అటు రెండుసార్లు ఏనుగును తిప్పారు... అంతే తిమ్మారెడ్డి పొట్టలోని పేగులు బయటకు వచ్చాయి. రక్తం కక్కుకొని ఆర్తనాదాలు పెడతా సచ్చినాడు...

'ఇప్పుడు వీడి శవాన్ని కవ్వంకోన అడవుల్లో విసిరేసి రండి... వీడి చివరి కోరిక మనం నెరవేర్చినట్లు అవుతుంది...' అని జెప్పి దొర బండి ఎక్కినాడు.

ఎర్ర దుమ్ము రేపుకుంటూ బండి ముందుకు కదిలింది. వీరనాయుడు ఆలోచనలో పడ్డాడు.

★ ★ ★

దొరను ఎదిరించడమంటే మాటలు కాదు. ముందే మనది బానిసల బతుకు... బయటికి తెలియకుండా బతకాలి... ఇసుకటెడారుల్లోనూ యుద్ధ క్షేత్రాల్లోనూ, పోరాడే దుర్భేద్యమైన ఆయుధంలా... పరమాణువులోని బ్రహ్మాండ విస్ఫోటక శక్తితో నిర్మించిన యుద్ధ నౌకలా... నిర్మితం కావాలి... ఏడేడు సముద్రాల కావల ఎత్తయిన మర్రి చెట్టు తొర్రలోని పచ్చని చిలుకలో ప్రాణం దాచినట్లు నిగూఢంగా వుంచగల పంజరం కావాలి... అయినా చివరి వరకు ఒకటి జ్ఞాపకం వుంచుకోవాలి- మాంసం ముద్దల కాయం లోపల పిడికెడు హృదయంతో పాటూ ఒక మహా సముద్రాన్ని మోసే శక్తితో జీవించాలి... అటు ఇటు అయితే ఏదైనా జరిగితే పంజరం పగిలితే... ఒక సముద్రం పేలుతుందని గుర్తుంచుకోవాలి. ఇలా వీరనాయుడు రకరకాలుగా ఆలోచిస్తున్నాడు...వీడని అంతర్మథనం!

బావి గట్టుపైన కూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తూనే వున్నాడు. నీళ్ళకొచ్చిన జానకి పెద్దమ్మ కపిలకు తాడేసి బిందెను బావిలోకి ధబీమని విడిసింది... వీరనాయుడ్ని చూస్తా పాటెత్తుకుంది.

"మూల కొండలా మెరిసే ముంగారి మెరుపు
గంగ పరమట కురిసే బంగారి వాన
నిండెనమ్మ నిడిగల్లు దండి సెరువుల్లు
పండెనమ్మ పెనుగొండ పెండ్లి బియ్యము
నాగు బాం కంకణము పడిగ బాసింగము
ఆకాశ పందిరులు భూదేవి తరగు
చుక్కల తలంబ్రాలు సూర్య దివిటీలు..."

పాట పాడతా నీళ్ళు తోడుతా వుంది ఆయమ్మ. ఆమె తీస్తున్న కీలు రాగానికి వీరనాయుడికి నవ్వు ఆగలేదు.

'ఏరా... అబ్బీ... ఆమంతన ఆలోచిస్తావుండావంటే చెల్లెలి పెండ్లి గురించేనా... మంచోడ్ని సూసి జెయ్యండి...'అని బిందెలోని నీళ్ళు కొన్ని ముఖాన జల్లిపోయింది- జానకి పెద్దమ్మ.

దొరల పాలనలో ప్రజలంతా నరకయాతన అనుభవిస్తా వుండారు... భయంకరమైన ఆకృత్యాలు ఎన్నో జరుగుతా వుండాయి... భరించ లేనంత పన్నుల భారం... దోచుకుంటున్న దోపిడీదారులు... ఏరులై పారుతున్న కల్లు... వడ్డీలకు వడ్డీలను బారువడ్డీలను చక్రవడ్డీలను కలుపుతూ పీడిస్తున్న వడ్డీ వ్యాపారాలు... వెరిసి అస్తవ్యస్తంగా... అల్లకల్లోలంగా కంపెనీ పాలన సాగుతోంది...

★ ★ ★

రాచవీడుకు ఉత్తరాన వున్న కోనంగి అడవుల్లోనుంచి దిన్నం రెత్తిరిపూట కాగడాల దొంగల ముఠా ఒకటి ఊర్ల మీద పడి దోచుకపోతున్న విషయం దొర సమక్షానికి వచ్చింది. నడి రాత్రప్పుడు కాగడాల్ని పట్టుకొని గ్రామాల్లోకి వచ్చే ఈ ముఠాను వ్యూహాత్మకంగా కట్టడి చేయాలని దొర భావించాడు. పగటి పూట తన దళాలను కోనంగి అడవుల్లోకి పంపాడు. అడవిని జల్లెడ పట్టించాడు. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన దివిటీ దొంగలు అక్క దేవతల కొండ జేరుకొని అక్కడున్న పోతురాజు గుహలో దాక్కున్నారు. దళాలకు అనుమానం వచ్చింది. కోనంగి అడవిని ఎంత గాలించిన దొరకడం లేదంటే ఎట్లా తప్పించుకున్నారని ఉపాయం ఆలోచించి వేట కుక్కల్ని విడిచిపెట్టినారు.

రెండు రాత్రులు... రెండు పగల్లు ఆ వేట కుక్కలు అడవంతా తిప్పించాయి దొర దళాలను. ఐదోరోజుకంతా అక్క దేవతల కొండకు జేరుకున్నాయి. వేట కుక్కలు వాసన పట్టాయి. సమాచారం గ్రహించలేని దివిటీ దొంగలు పోతురాజు గవిలోనే ముడుక్కున్నారు. గవి అంటే అట్లాటిట్లాటిది కాదు... రవ్వంత వెలుగైనా రాదు... నల్లటి కందెనబండ నేల... పట్టుకుంటే కూడా జారిపోయేంత కమురు... గబ్బిలాల కంపు... కీసురాళ్ళ రొద... వేట కుక్కలు గవి ముందుకు జేరుకొని మొత్తుకుంటా వుండాయి. దివిటీ దొంగలు లోపలెక్కడో వుండారనే సంగతైతే బలపడిపోయింది.

లోపలికెళ్ళే సాహసం ఎవరు జేస్తారు?

బంగ్లాకు వర్తమానం పంపారు.

దొర పయనమైనాడు.

వీరనాయుడు బండి కట్టాడు.

రాళ్ళ దారెంబడి అక్కడ దేవతల కొండ వరకు బండిపోయింది. ఆన్నుంచి కాళ్ళ నడకన దొర ముందుకు కదిలినాడు. వెనుక మందీ, మార్బలం...

పోతురాజు గవిని చూసినాడు- దొర. గబ్బిలాల కంపు భరించలేక ముక్కు మూసుకున్నాడు.

కాసేపు ఆ బండరాయి పైన కూర్చోని ఆలోచించినాడు. ఏదైతే అది అయితాది తాడు కట్టి వేట కుక్కల్ని గవిలోకి విడిసినారు. మొరిగే కుక్కలు అరగంట తర్వాత నిశ్శబ్దమైనాయి. తాడు పట్టి వెనక్కి లాగినారు తలలు లేని కుక్కల మొండేలు బయటకొచ్చినాయి పచ్చినెత్తురు కార్చుకుంటా! దొరకు పరిస్థితి అర్థమైంది. ఠాణానుంచి ఫిరంగి తెప్పించి గవిలోకి గుండు విడిపించినాడు.

ఒకే ఒక్కసారి గవి అంతా ఊగుతా గుండు పేలింది. అక్క దేవతల కొండంతా దుమ్ము పొగ కమ్ముకుంది.

అదే ఆఖరు దివిటీ దొంగల పేరు వినపడ్డం. మీసాలు దువ్వుకుంటా దొర కదిలినాడు.

★ ★ ★

నందన సంవత్సరంలో భయంకరమైన కరువొచ్చింది. వర్షాలు పడలేదు. పంటలు పండలేదు. ఆకాశం మీద మబ్బులు కమ్ముకొనింది లేదు. చినుకు రాలింది లేదు. ఎన్ని దేవర్లు జేసిన, గంగమ్మకు ఎన్ని బలులిచ్చినా, ఎన్ని కప్ప దేవర్లు జరిపించినా, ఎన్ని శిల బండ్లు కట్టినా ఆకాశం కనికరించలేదు. మోడాలు కప్పుకోవాల్సిన చోట డేగలు తిరగతా వుండాయి. చివరికి గొంతు తడుపుకోవడానికి కూడా గుక్కెడు మంచి నీళ్ళు లేకుండాపోయినాయి. ఊర్లో అందరికీ నీళ్ళిచ్చే శ్యామ నోళ్ళ బావి కూడా ఎండిపోయింది. ధరలు ఆకాశాన్ని అంటినాయి. పిడికెడు మెతుకులు పెట్టె నాథుడు లేక పేద సాదలు ఎన్నో ఇబ్బందులు పడతా వుండారు. తమ ఊర్లని, తమ ప్రజల్ని ఆకలి చావుల్నుంచి, కష్టాల నుంచి రక్షించమని దొరకు వినతిపత్రాలు రాసాగాయి. అందులో ఒకటి...

"మహారాజశ్రీ మేస్తరు యిస్కాయరు దొరగారి సముఖానకు... తమ ఆజ్ఞా ధారకుడైన కదిరి మునసపు అయోధ్యాపురం కృష్ణారెడ్డి అనేక సలాములు చేసి వ్రాసుకొనుచున్న విన్నపములు... కరువు దెబ్బకు ప్రజలు విలవిలలాడుచున్నారు. తమరు అనుమతించినచో గంజి కేంద్రాలు ఏర్పాటుచేసేదము. తమరి ఆజ్ఞకై ఈ విజ్ఞాపన చేసుకుంటున్నాము. యింతే అన్కే సలాములు. చిత్తగించ కర్తలు.

1833 మార్చి 25వ తేదీ.

అ. కృష్ణారెడ్డి"

నందన కరువు గురించి దొర ఆలోచనలో పడ్డాడు.

మద్రాసు కంపెనీ వాళ్ళకు వర్తమానం పంపినప్పటికీ వాళ్ళ హృదయాలు కరగలేదు. గంజి కేంద్రాల ఏర్పాటుకు పై నుంచి అనుమతి లభించలేదు. దొర కూడా మళ్ళీ ఈ అంశంపై కంపెనీ వాళ్ళతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపలేదు. ఊర్లల్లో జనం పడే ఆకలి బాధలు చూడలేక గ్రామ పెద్దలు, జమీందార్లు, పెద్ద వ్యాపారస్తులు చందాలు వేసుకొని విరాళాలు ప్రోగు చేసుకొని ఏడు లాంతర్ల సెంటరు కాడ పెద్ద గంజి కేంద్రమొకటి ఏర్పాటుచేశారు.

తనకు ఒంట్లో అనారోగ్యంగా వుందని జెప్పి టాంగా పని ఎగొట్టి వీరనాయుడు రహస్యంగా గంజి కేంద్రం చేరుకొని కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. ఒక రూపాయికి పద్దెనిమిది శేర్ల జొన్నలు గానీ పదమూడు శేర్ల బియ్యం గానీ వస్తూ వుండేవి. ఆ లెఖ్ఖన ధాన్యం కొనుగోలు జేసి గంజి కేంద్రాన్ని నడుపుతా వుండే మునిరత్నంకు సహాయకుడిగా వీరనాయుడు పనిజేసినాడు.

చుట్టు పక్క నూటాపదారు పల్లెల్నుంచి వస్తాండే పేదలు బీదలకు గంజిపోసి ఆకలి బాధ తీరుస్తా వుండిరి. ఏడు లాంతర్ల సెంటరు దగ్గర యాడ జూసినా జనం... జనం... ఈ సంఘటనతో కరువుకాటు పదునెంతో కంపెనీ వాళ్ళకు తెలిసి వచ్చింది. పన్నులు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఆచరణలోకి రాలేదు.

జనంలో వ్యతిరేకత వచ్చింది. కాలగమనంలో కంపెనీ దొరల పట్ల నమ్మకం సన్నగిల్లింది. ఫలితంగా నిరసనలు



తనకు ఒంట్లో అనారోగ్యంగా వుందని జెప్పి టాంగా పని ఎగొట్టి వీరనాయుడు రహస్యంగా గంజి కేంద్రం చేరుకొని కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. ఒక రూపాయికి పద్దెనిమిది శేర్ల జొన్నలు గానీ పదమూడు శేర్ల బియ్యం గానీ వస్తూ వుండేవి.

మొదలయ్యాయి. ఉద్యమాలు పుట్టుక రావడం ప్రారంభమైంది. జాతిపిత మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దక్షిణ భారత దేశ యాత్రల్లో భాగంగా గాంధీజీ పర్యటన దత్త మండలాల్లో కూడా ఖరారైంది. గాంధీ వస్తున్నాడనే వార్త దండోరా పలికింది. పల్లెపల్లెకూ సమాచారం చేరిపోయింది. మహాత్ముడ్ని చూడను ఊరూవాడా ఏకమై... జనం తండోప తండాలుగా వారంరోజులు ముందే ఎడ్లబండ్లు కట్టుకొని ఏడులాంతర్ల సెంటరు కాడికి తరలి వచ్చారు. గాంధీ రాక వార్త కంపెనీ వాళ్ళ గుండెల్లో దడదడ పుట్టిస్తోంది. కొన్నిచోట్ల అనుమతిస్తున్నారు. ఇంకొన్నిచోట్ల నిరాకరిస్తున్నారు. లాఠీచార్జీలు జరుగుతున్నాయి. వచ్చిన జనాన్ని వెనక్కి తరిమేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నడిరాత్రి పూట వీరనాయుడు ఏడు లాంతర్ల సెంటరు దగ్గర చేరిన జనానికి ప్రచార పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నాడు. గాంధీ రాకకు విస్తృత ప్రచారం లభించింది. గాంధీని చూడను... ఆ మహాత్ముడి ప్రసంగాన్ని వినను వేలాది మంది జనం... వారంరోజుల ముందుగానే ఏడులాంతర్ల సెంటరు కిక్కిరిసిపోయింది. ఆరోజు రానే వచ్చింది. జాతిపితను చూసిన జనం ఉద్విగ్నతకు లోనైనారు. గాంధీ ప్రసంగం మొదలైంది...

"తలుపులు తెరిచే వుంచండి
వెలుగైన రానీ...
చీకటి మాయైన రానీ
వచ్చేదేదో రాక మానదు!
కిటికీలు కూడా తెరిచే వుంచండి
పక్షులైన వాలనీ
పవనాలైనా వీయని
ఏదో ఒకటి జరగక మానదు!
గుండె ద్వారాల్ని కూడా విప్పండి
దుఃఖమైనా... సంతోషమైనా
ఏదో ఒకటి వచ్చే తీరుతుంది!

ఎప్పుడూ వెలుగుల్తో కన్పించే వెనెల్ని దోసిట్లో చూసుకునేలా మనల్ని మనం పగులకొట్టుకొని పాల రాతిగా మారదాం రండి... మనసు పొరలు చీల్చుకొని అరల మూలల్లోని ఆత్మను ఆవిష్కరింప జేద్దాం రండి... అడ్డంకుల్ని తెగొట్టుకొని అద్దంలా కన్పిద్దాం రండి... మీలోని తలుపులు తెరిచి ఒక జాతీయ నదిని చూపించండి... పిడికిళ్ళు బిగించి... గొంతెత్తి బిగ్గరగా నినదించండి... 'క్విట్ ఇండియా'...!" చినుకు మొగ్గలుగా మొదలైన మహాత్ముడి ప్రసంగం తుఫాన్‌గా మారింది... రవ్వంత నిప్పు తునకలా ప్రారంభమైన ఆవేశం దావాగ్ని కార్చిచ్చులా పెట్రేగుతోంది...

'క్విట్ ఇండియా'... అందరి గొంతులు ఒక్కటై ఒక్కసారిగా నినదించాయి. ఏడులాంతర్ల సెంటరు ప్రతిధ్వనించింది.

గాంధీ వెళ్ళిపోయాడే గానీ ఆయనిచ్చిన చైతన్య స్ఫూర్తి వీరనాయుడులో ప్రజ్వరిల్లుతూనే వుంది. భూమి పొరల్లోని విత్తనమెప్పుడూ నిద్రపోదు. చినుకు సాయం దొరికితే చాలు మట్టిపొరల్ని చీల్చుకొని పచ్చని విశ్వరూపం చూపిస్తుంది. అదే ఆశయ సాధన వీరనాయుడి కళ్ళ కాంతిలోనూ...!

★ ★ ★

మద్రాసు కంపెనీ పాలన ఆదేశాలమేరకు భూమి సర్వే ప్రారంభమైంది. ముప్పైమూడు అడుగుల ఇనుప గొలుసుతో భూమిని కొలుస్తున్నారు. పర్వతాలు, . గుట్టలు ప్రాంతాన్ని వదిలేసి భూములన్నింటిని కొలిచి, పొలాలకు నెంబర్లు కేటాయిస్తూ వచ్చారు. సాగులో వుండే భూములను, మెట్ట, మాగాణి భూములను తరగతులుగా వర్గీకరించుకుంటూ పోయారు. నెంబర్ల ఆధారంగా భూమినిబట్టి శిస్తును నిర్ణయిస్తూ రైత్వారీ పద్ధతి తీసుకొచ్చారు.

"చూడరా... వీరనాయుడు

నువ్వు పనిజేసే దొర...నువ్వు టాంగా కట్టెదొర... రైతుల కష్టాన్ని రైతు కూడును తన ఖజానాకు శిస్తులుగా ఎలా కొల్లగొట్టుకపోతున్నాడో... చూడు మీసం మెలేసే పాలెగాళ్ళుగూడా ఈ శిస్తులు కట్టలేరు. ఈ ప్రజల్ని ఆ దేవుడే కాపాడాలని"- రేత్తిరి పూట ఇంటి మిద్దెపైన పడుకున్నప్పుడు మునిరత్నం చెప్పిన మాటలే వీరనాయుడికి పదే పదే గుర్తొస్తున్నాయి.

★ ★ ★

జైన పాడు దగ్గర 'బూతుజాతర' జరుగుతాందని దొరగారికి కబురొచ్చింది. భక్తులు తమ కోర్కెలు నెరవేర్చాలని జైన తీర్థంకుడు పార్శ్వనాథుని విగ్రహానికి పూజలు చేస్తారు. పిల్లలు పుట్టని గొడ్రాళ్లు సంతానంకోసం అర్ధరాత్రి వేళ దిగంబరులై పూజలు, నాట్యాలు చేస్తూ పార్శ్వనాథుని ఆలింగనం చేసుకుంటారు. ఇలాంటి నృత్యాలను నిషేధిస్తున్నట్లు దొర పత్రం కూడా జారీచేశాడు. కానీ జాతర జరుగుతా వుందని తెలిసేసరికి ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

బండి బయలుదేరింది.

వీరనాయుడు చేతిలో పగ్గాలు...

చీకట్లో బండి కొండ దావన రివ్వున సాగిపోతాంది.

అప్పుడప్పుడూ చల్లగా వీచే గాలికి దొరకు కునుకు పట్టింది. బండి వీరాపురం వంక కాన్నుంచి కవ్వంకోన మీదుగా జైనపాడు దావన యల్లబారి పోతోంది. దారి సరిగ్గాలేదు. టాంగాకు బిగించిన గుడ్డి దీపాలు కూడా మినుకు మినుకుమంటూ చిన్నగా వెలుగుతున్నాయి అంతే...

జైనపాడు దగ్గరికి వస్తోంది...

దూరంగా ఎవరిదో పాట విన్పిస్తోంది...


"గండ్ల చీర కట్టరండి ఓ అమ్మలారా
వేప దీపం పెట్టరండి ఓ అమ్మలారా
సామి సుట్టు తిరగరండి ఓ అక్కలారా

(మిగతా 19వ పేజీలో)

# సైన్స్ క్లిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## ఆ మేఘానికి బూడిద వర్ణమేల!?



చిన్నచిన్న నీటి కణాలు లేదా మంచు బిందువులు గాలిలో వ్రేలాడుతూ ఉండటం వల్ల మేఘాలు తయారవుతాయి. ఇందులో గాలి, నీరు కూడా పారదర్శకమే. అంటే వాటి గుండా కాంతి ప్రయాణం చేస్తుంది. కొన్ని మేఘాలు తెల్లగా, మరికొన్ని బూడిద వర్ణంలో కన్పిస్తాయేమిటి? అనే అనుమానం మనకు కల్గుతుంది.

ఒక చెమ్చాలో పొడిగా నూరిన పంచదార లేదా ఉప్పును తీసుకుంటే అది మనకు తెల్లగానే కన్పిస్తుంది. ఇందులో పంచదార లేదా ఉప్పు కణం పారదర్శకంగా ఉంటుంది.

ఈపంచదార కుప్ప మీద కాంతి పడితే ఏమి జరుగుతుందో పరిశీలిద్దాం. పంచదార కణాల మధ్య గాలి ఉంటుంది. కాంతి ఒక మీడియం (యానకం) నుండి మరొక మీడియంలోకి వెళ్ళినప్పుడు కొంత పరావర్తనం చెందుతుంది. మరి కొంత ప్రసారం అవుతుంది.

రెండు మీడియంల సాంద్రత బాగా తేడాగా ఉంటే ఎక్కువ కాంతి పరావర్తనం చెందుతుంది. అంటే కాంతి వెనుదిరిగి వచ్చేస్తుంది. పంచదార కుప్ప మీదపడిన కాంతిలో కొంత భాగం లోపలకు దూసుకుపోతుంది. మిగిలిన భాగం పరావర్తనం చెందుతుంది. కాకపోతే ఈపరావర్తనం వివిధ దిశల్లో ఉంటుంది. అందుకే పంచదార తెల్లగా కన్పిస్తుంది.

ఇదేవిధంగా మేఘం మీద కాంతి పడినప్పుడు అందులో కొంత పరావర్తనం చెందడం వల్ల మేఘం తెల్లగా కన్పిస్తుంది.

ఇప్పుడు పంచదార కుప్పమీద కొద్దిగా నీరు లేదా పారదర్శకంగా ఉండే నూనె పోయండి. పంచదార తెల్లగా కన్పించదు. ఎందుకంటే గాలితో ఆక్రమించిన స్థలాలు సాంద్రతరమైన పదార్థం (నీటి)తో నిండి ఉండడం వలన కాంతి ఎక్కువగా పరావర్తనం చెంది వెనుదిరిగి రాదు. చాలాభాగం కాంతి కుప్పలోకి ప్రసారం అవుతుంది. వర్షించే మేఘం చాలా భాగం నీటికణాలతో నిండి ఉంటుంది. బాగా సాంద్రతరంగా ఈనీటికణాలు ఉంటాయి. ఈనీటి కణాలు నిరంతరం ఢీకొంటూ పరిమాణంలో పెరుగుతూ ఉంటాయి. ఈప్రక్రియ ఫలితంగా నీటి అణువుల మధ్య ఉండే గాలి పరిమాణం తగ్గిపోతుంది. తెల్లగా కన్పించే మేఘంలో నీటి అణువుల మధ్య ఉండే గాలి పరిమాణం కన్నా బాగా తగ్గిపోతుంది. అందువల్ల మేఘం ఎక్కువ కాంతిని పరావర్తనం చెందించలేదు. దానితో మేఘం బూడిద వర్ణంలో కన్పిస్తుంది. అటువంటి బూడిద వర్షపు మేఘం మరీ దళసరిగా లేకపోతే దాని వెనుకవున్న సూర్యుడు లేదా చందమామ మనకు కన్పిస్తారు. అదే తెల్లని మేఘం సూర్యునికి అడ్డం వస్తే సూర్యకాంతిని తెల్లని మేఘం సూర్యుని వైపుకే పరావర్తనం చెందించడం వలన మనకు సూర్యుడు కన్పించడు. అంటే తెల్లని మేఘం కాంతి నిరోధక పదార్థంగా ప్రవర్తిస్తుంది.

★

**రెండు మీడియంల సాంద్రత బాగా తేడాగా ఉంటే ఎక్కువ కాంతి పరావర్తనం చెందుతుంది. అంటే కాంతి వెనుదిరిగి వచ్చేస్తుంది. పంచదార కుప్ప మీద పడిన కాంతిలో కొంతభాగం లోపలకు దూసుకుపోతుంది. మిగిలిన భాగం పరావర్తనం చెందుతుంది. కాకపోతే ఈపరావర్తనం వివిధ దిశల్లో ఉంటుంది. అందుకే పంచదార తెల్లగా కన్పిస్తుంది.**

---

(10వ పేజీ తరువాయి)

గంధం చెక్క సాదరండి ఓ అక్కలారా...”

దొరకు మెలకువ వచ్చింది. కళ్ళు నులుపుకొని నిద్ర నుంచి మేల్కొన్నాడు.

ముందు వెళ్ళిన ఐదారు మంది జవాన్లు జనాన్ని చెదరగొట్టినారు. పక్కనున్న పెన్నానది యేటి ఇసుక దావన సగం మంది పారిపోయారు. దొర ఆ ప్రాంతమంతా తిరిగి పరిశీలన చేశాడు. పార్శ్వనాథుని విగ్రహం చుట్టూ ఇనుప ముళ్ళ కంచెను పాతించమని ఆజ్ఞ జారీచేసి బయలుదేరాడు. బండి మళ్ళీ బంగ్లాకు పయనమైంది.

అదే దారిన వెనక్కి వస్తోంది.

వీరనాయుడు గుండెల్లో గాంధీజీ చెప్పిన మాటలే మార్మోగుతున్నాయి. దొర బండిలో కునుకు తీస్తున్నాడు.

చాలాసేపు ప్రయాణం తర్వాత బండి ఊరి సరిహద్దుల్లోకి చేరుకుంది. కొంత దూరంలో లాండర్ల దీప వెలుగు...

అవును... ఏడులాంతర్ల సెంటరు వస్తోంది...

వస్తోంది... గాంధీజీ సందేశమిచ్చింది ఇక్కడే... ఇక్కడే... ఈ నేల మీదే... ఈ గడ్డమీదే... ఈ సెంటర్ కట్ట మీదే...

వీరనాయుడి సేతిలోని పగ్గాలు బిగుసుకున్నాయి. బండి వేగం తగ్గింది. చుట్టూ చూశాడు. ఏడుదారులు. మధ్య ఎత్తయిన కట్ట. కట్ట మధ్యన ఎత్తయిన ఉక్కు స్తంభం దానికి ఏడులాంతర్లు... కాస్క పక్కన చింత చెట్టు... తమకేమీ పట్టనట్లు అక్కడక్కడ విశ్రాంతిగా నెమరేసుకుంటూ జోగుతున్న పశువులు. దూరంగా ముందుకు సాగిపోతున్న జవాన్లు.

నడి రాత్రి పూట ఒంటరిగా దొర చిక్కాడు. ‘చూశావురా... వీరనాయుడు మన ఇంటికాడ మన ఊర్లో మనం నిలబడేకి కూడా కాలం కాకుండా పోయింది. వాడు యాన్నుంచో దేశం కాని దేశంనుంచి వచ్చి మన ఊర్లో రాజ్యమేలతా వుండాడు. ఎవడు మొగోడంటావ్?’అని ఆరోజున మునిరత్నం చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి వీరనాయుడికి.

యిక ఆలస్యం చేయలేదు. ఏడులాంతర్ల సెంటర్ దగ్గర టాంగా ఆగింది. దొరకు ఏమీ అర్థంకాలేదు... ‘ఏం చేస్తన్నావ్? ఏం చేస్తున్నావ్?’ అని ఆందోళన పడ్తున్నాడు. వీరనాయుడు ఒక్క ఉదుటున కట్టపైకెక్కి లాంతర్ల ఉక్కు స్తంభం ఎక్కి దొర చూస్తుండగా మన జాతీయ జెండా ఎగురేసినాడు... ‘క్విట్ ఇండియా’... నినదించాడు... గర్వంగా జెండా రెపరెప లాడుతోంది.

దొరకు నిద్ర మత్తు వదిలింది. చేతిలోకి రివాల్వర్‌ను తీసుకొని వీరనాయుడి కేసి గురిపెట్టాడు.

క్షణాల్లో తూటాలు వీరనాయుడి శరీరాన్ని తాకాయి. అంతే... ‘క్విట్ ఇండియా’ నినాదమే చివరి ఆర్తనాదమైంది.

ఏడులాంతర్ల ఉక్కు స్తంభానికి ఆనుకొని వీరనాయుడు కుప్పకూలిపోయాడు. ఏదో ప్రమాదం జరుగుతోందని వెనక్కి వచ్చిన జవాన్లు జరిగిన విపత్తును చూసి నివ్వెరపోయారు.

❁ ❁ ❁

ఈ సంఘటన జరిగిన రెండురోజులకు పెద్దపట్నం పోయి గవ్వల చెరువు గుట్టమీద వస్తాండేటప్పుడు దొర బండి దిగుడు కొండలోకి పల్టీ కొట్టింది. దొర కొండ బండ రాళ్ళ మధ్య నిక్కి నీల్గి సచ్చినాడు.

అందరూ ఇది వీరనాయుడుకి విధించిన శిక్షకు దేవుడు రాసిన మరణ శాసనమన్నారు. కాల ప్రవాహంలో ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. దొరలుపోయారు... దొరల పీడ విరగడైంది... ఏడు లాంతర్ల సెంటరుకు ఎప్పుడెళ్ళినా వీరనాయుడి త్యాగ నిరతి జ్ఞాపకమొచ్చి రెండు కళ్ళు చెమర్చుతాయి. గుండె నిండుగా జాతీయ భావం... అణువణువు పులకింప చేస్తుంది. ★